

3840

# లచ్చితల్లి

సంతకెళ్లే దారిలో సందుచివరి కొంపల్లో ఆఖరిది మా లచ్చిది.

విసిరేసినట్లు ఊరికి దూరంగా ఉంది మా బడి. బడికి వెళ్లేటప్పుడూ, తిరిగి వచ్చేటప్పుడూ లచ్చి నాకు తోడు.

లచ్చి ఇల్లు దారిలోనే కనుక, ముఖ్యంగా సాయంకాలంవేళ, అక్కడ కొంచెంసేపు ఆగి లచ్చి కొడుకుతో ఆడుకొనేవాణ్ణి. లచ్చి కొడుకు నాగన్న. వాడికి ఆటలు బాగా వచ్చు. చదువంటే మాత్రం ఇష్టంలేదు. ఎందుచేతనో లచ్చి వాడిని

బళ్ళో వేయలేదు. ఎందుకు బడికి పంపవంటే చెప్పేదికాదు.

లచ్చి అంటే మా ఇంట్లో అందరికీ ఇష్టం. నాకు మరీ ఇష్టం. లచ్చి మా అమ్మంత మంచిది.

లచ్చి అందమైందని మా అమ్మ అనేది. అందమంటే ఏమిటో నాకు తెలియదు. కాని మా లచ్చిఅంత అందమైంది ప్రపంచంలో లేదు అనుకొనేవాడిని.

లచ్చిఅంత మంచి దానిని - మా అమ్మలాంటి దానిని ఎవరైనా ఏడిపిస్తారని నేనెప్పుడూ అనుకోలేదు. ఎప్పుడూ నవ్వుతూ, నాతోపాటు ఆడుకొంటూ, నన్ను ఆడిస్తూ ఉండే లచ్చి ఏడుస్తుందని కూడా నే నెప్పుడూ అనుకోలేదు.

కాని ఒకరోజు లచ్చిని ఏడిపించారు కొందరు దుర్మార్గులు. లచ్చి ఏడిచింది. జరిగింది చెబుతాను. వినండి.

ఆవేళ పెందరాళే బడి మూసేశారు. లచ్చి నన్ను ఇంటికి తీసుకొనివెళ్ళింది. నాగన్న ఇంట్లో లేడు. లచ్చి నాకు కథలు చెబుతూఉంది. చీకటి పడింది. చీకటి పడకముందే ఇల్లు చేరుకోవాలని మా నాన్న ఆజ్ఞ. లచ్చి నొచ్చుకుంది. నన్ను ఇంటిదగ్గర దిగబెట్టి రావడానికి తలుపు దగ్గరగావేసి బయలుదేరింది.

రోడ్డుమీాదికి వచ్చేసరికి నలుగురు అయిదుగురు మమ్మల్ని చుట్టేశారు. వాళ్ళల్లో ఒకడు లచ్చిచేయి పట్టుకుని బలవంతంగా దగ్గరికి లాగుకొన్నాడు. లచ్చి నాచేయి బలంగా పట్టుకొంది. నేనుకూడా ముందుకు తూలిపడ్డాను.

వాళ్ళు అందరూ ఏవేవో మాటలు అంటున్నారు. లచ్చిని భయపెడుతున్నారు. ఎక్కడికో తమతో రమ్మంటు

న్నారు. వస్తే ఏమేమో ఇస్తామంటున్నారు. రాకపోతే ఏమేమో చేస్తామంటున్నారు.

లచ్చి వాళ్ళతో వెళ్ళనంది. తనను విడిచిపెట్టమంది. బతిమాలింది. ప్రార్థించింది. వాళ్ళు వినిపించుకోలేదు.

విదిలించుకోనడానికి లచ్చి ప్రయత్నించింది. వాళ్ళు విడవలేదు. ఇంకా మీది మీదికి వచ్చి నానామాటలూ అంటున్నారు.

ఎవడో లచ్చిచేయి పట్టుకుని బలంగా నొక్కాడు. లచ్చి పెద్దగా ఏడిచింది.

నాకు భయంవేసింది. కోపమూ వచ్చింది. "మా లచ్చిని విడిచి పెట్టండి" అని అరిచాను.

వాళ్ళల్లో ఒకడు "ఒరేయి, మునసబుగారి అబ్బాయిలా ఉన్నాడురా. గొడవ అవుతుందేమో" అన్నాడు.

"ఈ పిల్లాడి మాట నమ్మేదెవరు? బుకాయిద్దాం. లచ్చి ఇష్టపడిందని చెబుదాం" అన్నాడు మరొకడు.

నాకేమీ అర్థంకాలేదు.

లచ్చిని ఇంకేమి చేశారో - ఇంకా పెద్దగా ఏడుస్తూ ఉంది. ఎవడో లచ్చినోరు నొక్కాడు.

నాకు ఇంకా ఎక్కువ భయంవేసింది.

ఆ దగ్గర్లోనే మా పాలేరు రామడి కొంప ఉంది.

లచ్చిచేయి విడిపించుకొని ఒక్క పరుగు తీశాను. రామడి ఇల్లు ఇంకా కాస్త దూరంలో ఉండగానే పోలికేకలు పెట్టాను.

"రామోయ్! ఎవళ్ళో లచ్చినికొట్టేస్తున్నారోయ్" అని.

రామడు ఇంట్లోంచి ఒక్క గెంతు వేసి బయటపడ్డాడు. చూస్తూ ఉండగానే నాలుగు అంగల్లో ఆ దుర్మార్గుల మీద పెద్దపులిలా విరుచుకొని పడిపోయాడు. వాళ్ళల్లో ఒకడిని అమాంతం పైకిఎత్తి దూరంగా విసిరేశాడు.

దాంతో మరి వాళ్ళు ఏమనుకొన్నారో - మా లచ్చిని విడిచిపెట్టి ఒక్క పరుగున పారిపోయారు.

లచ్చి క్రింద కుప్పలా కూలి ఉన్నది. రామడి ఆసరాతో లేచి నిలబడింది. నేను లచ్చి దగ్గరికి వెళ్ళాను.

రామడు లచ్చివంక చూడనేలేదు. ఎటో చూస్తూ ఉన్నాడు.

"లచ్చీ, ఊఁ అంటే నీకీ బాధ విరగడౌతుందే" అన్నాడు.

"ఇంకామాట అనక. అదెప్పుడో అయింది. ఈ బతుకు ఇంతే" అన్నది లచ్చి.

"దిక్కులేకుండా ఇలాగే ఉంటావే, మరి" అన్నాడు రామడు.

"నా నాగడు ఉన్నాడులే" అంది లచ్చి.

'నా మాటే మరిచిపోయారు వాళ్లు' అనుకొన్నాను. నాకు కోపం వచ్చింది రామడిమీద.

అంతలో లచ్చి నన్ను అమాంతం చంటిపిల్లాడిలా ఎత్తేసుకుంది. "నాబాబే, నన్ను కాపాడాడు నాతండ్రి" అని నన్ను ముద్దు పెట్టుకుంది.

నేను గొప్పవాడిలా పొంగిపోయాను.

# 2

సెలవుల్లో మా ఊరు వెళ్ళాను.

"లచ్చి ఎప్పుడూ నీ యోగక్షేమాలు విచారిస్తూ ఉంటుంది. వెర్రిబాగుల్ది. పాపం! ఓ సారి చూచిరా. సంతోషిస్తుంది" అంది మా అమ్మ.

చిన్ననాటి అనుబంధాలు వయసు గడిచే కొలదీ మరింత దృఢంగా, ప్రియతమమైనవిగా కన్పిస్తూఉంటాయి.

ఇప్పుడు పెద్దవాడిని అయ్యాను. అర్థం చేసుకోగలుగుతున్నాను.

లచ్చి చిన్నప్పుడు ఎంతో ఇప్పుడూ అంతే నాకు.

అమ్మలాగే ఇప్పుడుకూడా నన్ను చిన్నపిల్లవాడుగా చూస్తుంది లచ్చి. అనుమానం ఏముంటుంది? ఈలాంటి అనుభవం కోరుతున్నాను ఇప్పుడు. తిరిగి లచ్చి ప్రేమ నాకు లభ్యంకావాలి. బాల్య సహజమైన అమాయకత్వం నేను తిరిగి చవిచూడాలి అనుకున్నాను.

కాని 'పాపం!' అన్నదే అమ్మ? లచ్చి జీవితంలో ఒడుదుడుకులు ఏమైనా సంభవించినవా? ఆమె కష్టాల్లో మునిగిందా?

"ఫరవాలేదు, నేను ఉన్నాను. ఆమె కష్టాలు ఎలాంటివైనా సరే తొలగించగల శక్తి నాకు ఉన్నది" అనుకొన్నాను.

వెనుకటి సంఘటన జ్ఞప్తికి వచ్చినది. నాలో నేనే నవ్వుకొన్నాను. లచ్చి చేయిచాచి ఒకరి సహాయం అర్థిస్తుందని అనుకోలేకపోయాను.

అందునా లచ్చికి నా అవసరం ఏముంటుంది? నాగన్న ఉన్నాడు. అతడే తల్లిని ఆదుకోగలడు. ఆ తల్లికి ఒకరిసహాయం పొందవలసిన అగత్యమేమీ లేకుండా చేయగలడు.

ఈలా అనుకొంటూ ఆ సాయంకాలం మునిమాపువేళ లచ్చి ఇంటికి వెళ్ళాను.

లచ్చిఇల్లు మునుపటిలా లేదు. అరుగుమీద ఒక చిన్న దుకాణం వెలిసిఉన్నది.

నేను వెళ్లేసరికి లచ్చి ఇంట్లోనుంచి పెద్ద కేకలు వినిపిస్తున్నవి.

పూర్వంలా లోపల చొరబడడానికి సంకోచించాను. లోపలినుంచి వినవచ్చే కేకలు కూడా నా స్వాతంత్ర్యానికి అవరోధమే అయినవి. గుమ్మందగ్గరే నిలబడిపోయాను.

అంతలో విసురుగా తలుపు తెరచుకొని బయటపడ్డాడు ఒక ఆజానుబాహుడు. చాలాకాలమే అయినా నాగన్నను పోల్చుకోగలిగాను.

నాగన్న నన్ను గమనించలేదు. నా ఉనికి గుర్తించలేదు. గుర్తించినా లెక్కచేయలేదేమో అని ఆ తరువాత ఒక్కొక్కప్పుడు అనిపిస్తూ ఉంటుంది.

పెద్దగా రొప్పుతున్నాడు నాగన్న. కోపంతో ముఖం జేవురించి ఉన్నది.

"ఈ ఇంట్లో ఇంక ఒక్క క్షణంకూడా ఉండను. నా డబ్బు తీసుకొని నా ఇష్టం వచ్చినచోటికి పోతాను. చచ్చినా మళ్ళీ రాను. గంగలో దిగు" అని అరుస్తూ గుమ్మం దిగి వీధిలోపడ్డాడు నాగన్న.

లోపలినుంచి లచ్చి బయటికి వచ్చింది. నా వంక చూచింది. ముఖంలో మార్పు లేకపోయినా ఆమె హృదయం చిక్కబట్టుకొన్నదనిపించినది నాకు ఆ క్షణంలో.

నన్ను పలకరించలేదు లచ్చి.

కొడుకు వెనుకనే గుమ్మందిగి రోడ్డు అంచునే నిలబడినది.

"నామీద కోపంవచ్చి నువ్వు పోవడం దేనికిరా, నాగా? నువ్వుండు. నేనే పోతాలే" అన్నది లచ్చి.

నాగన్న విసురుగా పోతూవున్నవాడు వెనక్కుతిరిగాడు.

"ఆ రామిగాడితో నువ్వు కులుకుతూ ఉంటే చూస్తూ ఊరకుండాలా నేను" అని అరిచాడు నాగన్న.

లచ్చి ముఖం వివర్ణమైపోయినది. నిలబడ్డచోటనే కూలిపోతుందేమోనని భయపడ్డాను.

అంతటి ఆఘాతాన్ని ఆ తల్లి ఎట్లా సహించగలిగిందో నాకు తెలియదు.

నాకు తెలిసినదల్లా ఒక్కటే.

చిన్నతనంలో మారాంచేస్తూ లచ్చిని 'అమ్మ' అనేవాడిని. లచ్చి పిచ్చిఆనందంతో ఉప్పొంగిపోయేది.

ఆవేశం వచ్చింది ఆ సమయంలో. గాయపడిన ఆ తల్లి హృదయం తప్ప మరేమీ కనుపించలేదు కళ్ళకు.

ఒక్క అంగలో ఆమెను చేరుకొన్నాను. లచ్చిని పట్టుకొన్నాను.

"అమ్మా" అని ఆక్రోశించినది నా హృదయం. "అమ్మా" అని పిలిచినది నా కంఠం.

ఆ తల్లి కళ్ళు చెమర్చినవి. చిన్నప్పటివలెనే నా తల తడిమి నన్ను దగ్గరికి తీసుకొని "బాబూ" అన్నది.

మహాసాధ్వి జానకీదేవిని ఆడిపోసినది లోకం. భూదేవి క్రుంగిపోలేదు.

సీతాదేవి పడని కష్టం మా లచ్చికి సంభవించినది.

కన్నబిడ్డడే కాకికన్న హీనంగా చూస్తే సహించ గలదా తల్లి?

ఎక్కడినుంచి వచ్చాడో, ఎలా ఆ మాటలు విన్నాడో రాముడు-

"నాగా" అని భీకరంగా ఒక కేక వేశాడు.

నాగన్న వెనుకకు తిరిగి చూడకుండా అదృశ్య మైనాడు.

సరాసరి నా దగ్గరికి వచ్చాడు రాముడు.

"చిన్నబాబూ, కొడుకుకూడా కాకుండా పోయాడు లచ్చికి. దుకాణంపెట్టి నాలుగు డబ్బులు సంపాదించి పెంచి పెద్దచేసింది నాగడిని. వాడే దానికి శత్రువయ్యాడు. ఇప్పుడు డబ్బంతా కాజేసిపోతున్నాడు. ఇంక దిక్కెవ్వరు?"

రాముడు చాలా ఆవేశంతో మాట్లాడుతున్నాడు. నా సమాధానంకోసం నిరీక్షించలేదు. లచ్చివంక తిరిగాడు.

"లచ్చీ, లేనిది అంటకట్టారు ఊరివాళ్లు నీకు. నాకు తెలుసు, భగవంతుడికి తెలుసు. ఇదివరకు సహించావు అంతా. ఇప్పుడు సహించలేవు. ఊఁ అను. నీ కేబాధా లేకుండా చేస్తాను" అన్నాడు.

"చిన్నబాబూ, నువ్వేనా చెప్పు. నీ మాట కాదనదు" అని అర్థించాడు నన్ను రాముడు.

నేను మాట్లాడలేకపోయాను.

లచ్చి తలమెత్తి ఎటో చూస్తూ "ఇంక నా ఒక్క పొట్టకోసంకదా, నా బ్రతుకు నేను బ్రతుకుతాను. నా మానాన నన్ను ఉండనియ్యి" అంది.

"ఏం చూసుకు బ్రతుకుతావ్" అని ఎత్తిపొడిచాడు రాముడు.

"నా బాబు నాకు ఉన్నాడు" అంది ఆ తల్లి నా చేయి పట్టుకొని.

రాముడు బ్రమాన్పడిపోయాడు.

నాకు అర్థంకాలేదు.

## 3

ఆలోచన ఎల్లప్పుడూ ఒక విధంగా ఉండదు. స్థిరత్వమూ ఉండదు.

వయసులో ఎలా ఉన్నా జీవనసంధ్యలో మనసు ఎల్లప్పుడూ మరణంమీదనే లగ్నమై ఉంటుంది.

కోరిన కోరిక సఫలంకావడం సుఖమా? విఫలం కావడం దుఃఖమా?

'జాతస్య మరణం ధ్రువమ్' అయినప్పుడు మరణం విషాదాంతమా? లేక సుఖాంతమా?

ఆలోచన తెగదు.

నాకూ చరమకాలం ఆసన్నమైనది.

వెనుకటి సంఘటనలు ఇప్పుడు లీలగా మాత్రమే గోచరిస్తున్నవి.

ఉద్యోగ విరమణానంతరం స్వగ్రామంలోనే ఉన్నాను.

ఇప్పుడు అమ్మ లేదు. లచ్చి ఉన్నది. నడిచే శక్తి కూడా కోల్పోయినదామె.

తల్లిని కోల్పోయిన నాకు 'లేదు, నీ తల్లి యింకా ఉన్నది' అనిపిస్తూ ఉంటుందా వృద్ధమూర్తి. నా జీవితాన్ని పునీతం చేసిందా తల్లి అఖండమైన ప్రేమ.

రోజూ సాయంకాలం లచ్చి దుకాణానికి వెళ్ళి గంటల తరబడి ఆమెతో కబుర్లు చెప్పుతూ ఉండటం పరిపాటి.

ఆ రోజు సాయంకాలం నేను వెళ్ళేసరికి బడిపిల్లలు కొందరు గొడవచేసి, అల్లరిచేసి లచ్చిని బాధిస్తున్నారు.

వయసుమళ్ళిన నన్ను చూచి వారు పారిపోలేదు. చివరికి చేతికర్రతో బెదిరించి వారిని తరిమివేయవలసివచ్చింది.

ఈలాంటి అనుభవం లచ్చికి నిత్యానుభవమే అయి వుంటుందని గ్రహించాను.

ఇంతకాలమూ లచ్చికి నా చేయూత అవసరం లేక పోయింది.

జీవనసంధ్యలో ఈలాంటి అగత్యం కలిగినందుకు నేను ఆనందించలేకపోయాను.

వేరొకరిస్థానం తెలియకనే ఆక్రమిస్తున్న భయం మనసును కలవరపరిచినది. వెలితి కనుపించినది.

జీవితకాలం అంతా లచ్చికి బాసటగా నిలిచిన రాముడు ఎక్కడ?

అదే అడిగాను లచ్చిని.

లచ్చి కళ్ళల్లో జీవితంలో మొదటిసారి నేను చూడగా నీరు నిలిచినది.

లచ్చి అస్పష్టంగా తనలోతానే గొణుగుకొన్నది:

"ఊఁ అంటే ఎంత బాగుండును?"

---